ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
ఆదివారం 1 సెప్టెంబరు 2024

*** గరిష్ఠం 26.0 కనిష్ఠం 22.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589 (309.0570)	4,74,359	4,12,078
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.00 (4.20)	11,000	14,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.81 (38.08)	2,69,289	2,87,262

చికెన్ ధరలు: లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

నల్లగొండ మండలం పాతపల్లి-శేషమ్మగూడెం బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వరద



భారీ వర్షం

- ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురిసిన వాన
- స్తంభించిన జనజీవనం.. రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

నల్లగొండ, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ధోరణి ప్రభావంతో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండ పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్ ప్రాంగణంలోకి నీరు చేరింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 10.3 సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లాలో అత్యధికంగా కొండమల్లేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో 8.5 సెంటీమీటర్లు, అత్యల్పంగా మిర్యాలగూడలో 3.7సెంటీమీటర్ల వర్షం కురిసింది. మాడ్గులపల్లి మండలం చిరుమర్తి, బొమ్మకల్, కల్వలపాలెం వాగుపై ఉన్న చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. చండూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్ భారీ వర్షానికి జలదిగ్బంధంగా మారింది. శాలిగౌరారం మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించా రు. కలెక్టరేట్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోజంతా ముసు రు కమ్మేయటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. అత్యధికంగా కోదాడలో 5.9సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాయంత్రం నుంచి ఎనిమిదిన్నర గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఇళ్లలోకి నీరు చేరాయి. విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో పట్టణమంతా అంధకారమయమైంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వాహనాలు, ఖమ్మం నుంచి కోదాడ సూర్యాపేట నుంచి కోదాడకు వచ్చే వాహనాలు రహదారులపై నిలిచాయి. దీంతో ప్రయాణికులు బస్సులు కార్లలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కోదాడ పట్టణ సమీపంలోని శ్రీరంగాపురం వద్ద డివైడర్ పైనుంచి నీరు ప్రవహిస్తూ జలపాతాన్ని తలపిస్తోంది. చింతలపాలెం మండలం నుంచి ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం, దొండపాడు, వజినేపల్లి గ్రామాల్లో వాగులు రోడ్ల మీద నుంచి పొంగిపొర్లటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



నల్లగొండ మండలంలో పత్తి చేనులో నిలిచిన వరద

కలెక్టరేట్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలు ● నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద ● ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

గణేష్ విగ్రహాలకు అనుమతి తీసుకోవాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం, ఆగస్టు 31: జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాలు ఏర్పాటుకు నిర్వాహకులు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో కోకరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో శాంతి యుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించుకోవాలన్నారు. పోలీస్ యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచాలని, దరఖాస్తును సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు.

ఉన్నత ప్రమాణాలతో బోధించాలి

డీఐవో దస్రూనాయక్

నార్కట్‌పల్లి, ఆగస్టు 31: ఉన్నత ప్రమాణాలతో అధ్యాపకులు విద్యాబోధన చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి దస్రూనాయక్ అన్నారు. నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత విద్యా సంవత్సరం నుంచే ఈ కళాశాల నడుస్తోందని, ఇక్కడి అధ్యాపకులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో ఈ విద్యా సంవత్సరం కూడా కృషిచేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. కళాశాల వార్షిక నివేదికను ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ ప్రవేశపెట్టారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, వీరమల్ల వెంకటేశ్, సంజీవ్, ప్రకాశ్, నెమత్ సుల్తానా, సంతోషి రాణి, తేజస్విని, అస్మా, యామిని, జ్యోత్స్న, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి

సంఘం క్షేత్ర సంఘటన మంత్రి శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్నసంఘం క్షేత్ర సంఘటన మంత్రి శివకుమార్

నల్లగొండ టౌన్, ఆగస్టు 31: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషిచేస్తోందని, ఐదుగురితో ప్రారంభమైన సంఘం నేడు 50వేల సభ్యత్వాలతో తొలి స్థానంలో నిలిచిందని ఏబీవీపీ క్షేత్ర సంఘటన మంత్రి చిరిగి శివకుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను జ్యోతి ప్రజ్వల చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏబీవీపీ కేవలం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా జాతీయవాదం వైపు నడిపిస్తున్న ఒక దేశభక్తిగల సంస్థ అన్ని అన్నారు. దేశంలో స్వయం ప్రకటిత మేధావివర్గం నిత్యం భావ ప్రకటన స్వేచ్ఛ, మహిళా సాధికారత అంటూ అరిచే గొంతులు కలకత్తాలో జరిగిన అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలని, దోషులను త్వరగా శిక్షించాలని దేశం మొత్తం ఉద్యమిస్తుంటే ఆ గొంతులు ఎందుకు మూగబోయాని ప్రశ్నించారు. ఎన్‌సీబీ ప్రకటించిన నివేదికలో దేశంలో రైతు ఆత్మహత్యల కంటే విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల ఆత్మహత్యలు ఏడు శాతం పెరిగాయని, దీన్ని అధిగమించేందుకు ఏబీవీపీ ఆధ్వర్యంలో పరిసర్ చలో అభియాన్ పేరుతో విద్యార్థులను మానసిక శక్తివంతులుగా మలిచే కార్యక్రమాన్ని చేపట్టనుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, విభాగ్ ప్రముఖులు ప్రమోద్‌కుమార్, విభాగ్ కన్వీనర్ సురువి మణికంఠ, జిల్లా కన్వీనర్ రావుల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం కాని జాతీయ పశుగణన యాప్

వాయిదాపడిన జంతువుల లెక్కింపు

నల్లగొండ, ఆగస్టు 31: ఈ నెల 1వ తేదీ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు నాలుగు నెలలపాటు జరగాల్సిన జాతీయ పశుగణన వాయిదా పడింది. దేశవ్యాప్తంగా పశుగణనకు సంబంధించి యాప్ అందుబాటులోకి రాకపోవడంతో మూడు రోజులపాటు ఈ ప్రక్రియను నిలిపి వేశారు. దేశవ్యాప్తంగా ప్రతీ ఐదేళ్లకోసారి చేపట్టే పెంపుడు జంతువుల పశుగణనకు సర్వర్‌లో తలెత్తిన సమస్యలతో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలతోపాటు 19 మునిసిపాలిటీల్లో చేపట్టాల్సిన పశుగణన నిలిపివేశారు. పశుగణనలో పెంపుడు జంతువులైన ఆవు, గేదె, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, పందులు, గాడిదలతో పాటు కోడి, బాతుల లెక్కింపు, స్వదేశీ జాతులు, విదేశీ జాతుల వివరాలను విరివిగా శాస్త్రీయ పద్ధతిలో పశుసంవర్ధకశాఖ బృందాలు ప్రతీ ఇంటికి వెళ్లి ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి సన్నద్ధం అయినప్పటికీ యాప్ అందుబాటులో లేక ప్రక్రియ నిలిచిపోయింది.

పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ సదానందం బదిలీ

నల్లగొండ జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ సదానందం పదోన్నతితో బదిలీ అయ్యారు. నెలరోజుల క్రితమే ఆయన నల్లగొండ జిల్లాకు వచ్చారు. సదానందంను పదోన్నతిపై వికారాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన అధికారి వచ్చే వరకూ స్థానిక అధికారికి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు ఇవ్వనున్నారు.



రిటైర్మెంట్ తప్ప.. రిక్రూట్‌మెంట్ లేదు!

> ఆర్టీసీ సంస్థలో రిటైర్మెంట్‌లే తప్ప రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో డ్రైవర్ల కొరత ఏర్పడింది. ఎక్కేందుకు ప్రయాణికులు, తిరిగేందుకు బస్సులు ఉన్నా నడిపేందుకు డ్రైవర్లు లేక నల్లగొండ రీజియన్ వ్యాప్తంగా రోజుకు 20 నుం చి 30 బస్సులు పలు రూట్లలో రద్దవుతున్నాయి. బస్సుల సంఖ్యకంటే డ్రైవర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి.
> \- నార్కట్‌పల్లి

కొత్తగా నియామకాలు లేకపోవడంతో ఆర్టీసీని డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తప్పనిసరి పరిస్థితుల్లో బస్సులు నడపాల్సిన వచ్చినప్పుడు ఉన్న డ్రైవర్లతో డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. అయినా సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రద్దీ మేరకు బస్సులు లేకపోవడంతో హైదరాబాద్ వంటి ప్రధాన ప్రాంతాలకు వెళ్లే సర్వీసుల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్తున్నారు. 2014 నుంచి 2023 వరకు రీజియన్ వ్యాప్తంగా సుమారు 200 మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేశారు. కానీ, కొత్తగా ఒక్క డ్రైవర్ పోస్టును కూడా భర్తీ చేయలేదు.

880 మంది డ్రైవర్లు అవసరం

ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌లో నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, కోదాడ, దేవరకొండ, నార్కట్‌పల్లితో కలిపి మొత్తం ఏడు డిపోలు ఉన్నాయి. ఈ ఏడు డిపోల పరిధిలో సుమారు 720 బస్సు సర్వీసులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. వీటిలో ఆర్టీసీకి చెందినవి 450 బుస్సులు కాగా, మిగతా 270 అద్దె బస్సులు ఉన్నాయి. 610 షెడ్యూల్స్ ప్రకారం ఆయా రూట్లల్లో బస్సులు నడుస్తున్నాయి. అయితే ఆర్టీసీకి మొత్తం 880 మంది డ్రైవర్లు అవసరం కాగా, ప్రస్తుతం 815 మంది ఉన్నారు. రోజువారీ షెడ్యూల్స్‌కు 65 మంది డ్రైవర్లు తక్కువగా ఉన్నారు. కొంత మంది అనారోగ్య సమస్యలతో సెలవుల్లో ఉంటున్నారు. దీంతో పనిచేస్తున్న డ్రైవర్లతోనే డబుల్ డ్యూటీ చేయిస్తున్నారు. ఆర్టీసీ రికార్డుల ప్రకారం ఒక్క నార్కట్‌పల్లి డిపో మినహా కోదాడ డిపోలో 16 మంది, నల్లగొండ 17, దేవరకొండ 15, మిర్యాలగూడ 15, సూర్యాపేట ఐదు, యాదగిరిగుట్ట నాలుగురు డ్రైవర్లు బస్సు షెడ్యూల్స్ కంటే తక్కువగా ఉన్నారు. 2014 నుంచి 2023 వరకు నల్లగొండ రీజియన్ పరిధిలో సుమారు 200 మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ చెందగా, కొత్తగా ఒక్క డ్రైవర్‌ను నియమించలేదు.

అన్నింటా రికార్డులే

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలతో నల్లగొండ రీజియన్ అన్ని విభాగాల్లో రికార్డులను నమోదు చేస్తోంది. పర్వదినాల్లో రికార్డుస్థాయి ఆదాయాన్ని నమోదు చేసుకుంటున్న రీజియన్ సెంచరీకి దగ్గరగా ఓఆర్‌ను పదిలపర్చుకుంటోంది. నల్లగొండ రీజియన్ పరిధిలో సుమారు 2.85లక్షల మందికి పైగా ప్రయాణికులు నిత్యం బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. షెడ్యూల్స్ కింద నడుస్తున్న బస్సులు సుమారు 2.45లక్షల కి.మీలు తిరుగుతూ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. రూ.1.46 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంటూ రూ.58 ఈపీకేను నమోదు చేస్తోంది. పూర్తిస్థాయిలో డ్రైవర్లను నియమించడంతో పాటు రద్దయిన బస్సులు కూడా నడిపితే ఇంకా ఆదాయం పెరుగుతుందన్న వాదన వినిపిస్తోంది.

ఉన్నవే మూడు షెడ్యూల్స్.. రోజూ ఒకటి క్యాన్సిల్

నార్కట్‌పల్లి డిపోలో ఉన్నవి ముచ్చటగా మూడే షెడ్యూల్‌లు. అయినా వాటిల్లో రోజుకో షెడ్యూల్ క్యాన్సిల్ చేస్తున్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతుండగా, మూడు బస్సులకు ఒకటి చొప్పున సర్వీస్ రద్దవుతుండటంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ల కొరతతో దిల్‌సుఖ్‌నగర్ లేదా భువనగిరికి నడవాల్సిన ఏదో ఒక రూట్ బస్సును క్యాన్సిల్ చేస్తున్నారు. డ్యూటీ కోసం యూనిఫాం వేసుకుని వచ్చే కండక్టర్‌కేమో అనవసరంగా సెలవు పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోను కుదించిన ఉన్నతాధికారులు ఈ డిపోకు చెందిన బస్సులను పెద్ద సంఖ్యలో ఇతర డిపోలకు పలు దఫాలు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆరు బస్సులు మాత్రమే డిపోలో ఉన్నాయి. వీటిలో మూడు షెడ్యూల్స్ ఉండగా, మరో మూడు సర్వీసులు స్పేర్‌గా కొనసాగిస్తున్నారు. ఇవీగాక తొమ్మిది అద్దె బస్సులున్నాయి. డిపో నుంచి ఎలికట్టె, దిల్‌సుఖ్‌నగర్, భువనగిరికి మాత్రమే ప్రస్తుతం మూడు షెడ్యూల్స్ నడుస్తున్నాయి. డ్రైవర్లు మొత్తం ఆరు గురు మాత్రమే ఉన్నారు. కండక్టర్లు 40 మంది వరకు ఉన్నారు. డిపోలో డ్రైవర్ల కొరత కారణంగా తప్పనిసరై ఒక్కోసారి డబుల్ డ్యూటీ చేయిస్తున్నారు. దీంతో మరుసటి రోజు ఆరోగ్యం సహకరించక డ్రైవర్లు డుమ్మా కొడుతున్నారు. అద్దె బస్సులదీ అదే పరిస్థితి. డ్రైవర్లు గైర్హాజరవుతుండటంతో బస్సులు రద్దవుతున్నాయి. దీంతో డ్యూటీ కోసం సిద్ధమై వచ్చిన కండక్టర్ మాత్రం సెలవుతో వెనుతిరుగుతున్నారు. ప్రయాణికులు మాత్రం ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

ఉదయం నల్లగొండకు బస్సు నడపాలి



హాస్టల్‌లో ఉండే పరిస్థితి లేక కళాశాలకు డేస్కాలర్‌గా వెళ్తున్నా. దీంతోపాటు ప్రత్యేక కోర్సు నేర్చుకుంటున్నా. క్లాసులు ఉదయం 6.30గంటలకే మొదలవుతాయి. కానీ, ఆ సమయానికి నార్కట్‌పల్లి బస్టాండ్ నుంచి బస్సు లేదు. నాతో పాటు విద్యార్థులు,ఇతర ప్రయాణికులు కూడా ఉదయాన్నే నల్లగొండకు బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు నడపాలి.
\- హన్సిక, ఇంటర్ విద్యార్థి

డ్రైవర్ల కొరతే కారణం



వీలైనంతవరకు బస్సులు రద్దు కాకుండా చూస్తున్నాం. డ్రైవర్ల కొరతతోనే సమస్య ఏర్పడుతోంది. అయినా డబుల్ డ్యూటీ చేసేలా డ్రైవర్లను ఒప్పించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. నల్లగొండకు ఉదయాన్నే బస్సు నడిపేందుకు డిపోలో సర్వీసులు లేవు. ఈ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్తా.
\- ఎంవీ.చారి, టీఐ, నార్కట్‌పల్లి

రోజువారీ డ్రైవర్లను నియమించాలి

మహిళలకు ఉచిత ప్రయాణం అమలులోకి వచ్చాక పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు సరిపోవడం లేదు. గతంలో బస్సులు లేని కారణంగా డ్రైవర్లు సెలవు పెట్టాల్సి వచ్చేది. కానీ, ప్రస్తుతం డ్రైవర్ల కొరత కారణంగా బస్సులు రద్దవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు రోజువారీ వేతనం కింద ఇప్పటికే డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన, గతంలో ఆర్టీసీలో తాత్కాలిక వేతనం కింద పనిచేసిన, లేదా ఉద్యోగవిరమణ చెందిన వారిని రోజువారీ వేతనం కింద పనిచేసేందుకు ఉత్సాహం చూపేవారిని డ్రైవర్లుగా నియమించాలని ప్రయాణికులు సూచిస్తున్నారు. వేతనాల పెంపు, సంస్థ పరిరక్షణ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐక్య కార్మిక సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించిన సమయంలో రోజువారీ వేతన డ్రైవర్లను నియమించి బస్సులు నడిపిన సందర్భాన్ని ప్రయాణికులు గుర్తుచేస్తున్నారు. ఇపుడు కూడా అదే మాదిరి డ్రైవర్లను నియమించి బస్సుల కొరత తీర్చాలని కోరుతున్నారు.

నల్లగొండకు ఉదయం 6.30 వరకు బస్సే లేదు

నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు ఉదయం 6.30 గంటల వరకు బస్సులే లేవు. హైదరాబాద్‌లో నైట్ హాల్ట్ ఉండే మిర్యాలగూడ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు తెల్లవారుజామున 5.10గంటలకు నార్కట్‌పల్లికి వస్తుంది. పొరపాటున ఆ బస్సును అందుకోకపోతే మరో 1.20గంటల వరకు నార్కట్‌పల్లి బస్టాండ్ నుంచి నల్లగొండకు బస్సులేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పొద్దున్నే ప్రత్యేక తరగతులకు హాజరు కావాల్సిన పాఠశాల, కళాశాల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్‌పాస్ తీసుకుని కూడా ఉపయోగం లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ ఒక్కరు సన్మార్గంలో పయనించాలి

ఆమనగల్లు శ్రీరామ ఆశ్రమ పీఠాధిపతి శివనందస్వామి

దేవరకొండ, ఆగస్టు 31: ప్రతీ ఒక్కరు దైవభక్తిని పెంచుకొని సన్మార్గంలో పయనిం చాలని ఆమనగల్లు శ్రీరామ ఆశ్ర మ పీఠాధిపతి శివనందస్వామి అన్నారు. శనివా రం దేవరకొండ పట్టణం కొండమల్లేపల్లి రోడ్డులోగల భక్తమార్కండేయస్వామి దేవస్థానంలో జరిగిన దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. దైవభక్తితోనే మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వనం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి మన్న మణిదీప్, కోశాధికారి శేరిపల్లి ఎల్లయ్య, ఉపాధ్యక్షులు గాజుల రాజేష్, మన్న యాదగిరి, శిరందాసు శ్రీనివాసులు, చిలువేరు స్వామి, నందీశ్వర్, సహాయకార్యదర్శులు చంద్రమౌళి, గాజుల వినయ్, భవన రుషి, గాజుల యాదమ్మ, పగిడిమర్రి శ్రీనివాసులుతోపాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, పగిడిమర్రి శివ, గౌరవ అధ్యక్షులు శ్రీరాములు, గాజుల అంజనేయులు, వనం చంద్రమౌళి, భిక్షమయ్య, పగిడిమర్రి విశ్వం పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

మాడ్గులపల్లి, ఆగస్టు 31: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గజలాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భక్తులు గ్రామ దేవతలను పూజించుకోవాలని, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని సోదర భావంతో నడుచుకోవాలని అన్నారు. ప్రభుత్వం దేవాలయల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్లే గ్రౌండ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, పొదిల శ్రీనివాస్, అర్జున్, స్కైలాబ్‌నాయక్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, పుల్లెంల నరసింహ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా నియంత్రణాధికారి దుర్గయ్య



కస్తూర్బా బాలికల పాఠశాలలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

శాలిగౌరారం, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి జిల్లా మలేరియా నియంత్రణాధికారి దుర్గయ్య అన్నారు. శాలిగౌరారంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను జిల్లా మలేరియా నియంత్రణ అధికారి దుర్గయ్య శనివారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులు సక్రమిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా ఆయన సందర్శించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పరిసరాల పరిశుభ్రతపై, సీజన్‌లో వ్యాపించే అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఉన్న శానిటేషన్‌ను, వంట, తరగతి గదులను, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నీరునిల్వ ఉండకుండా శుభ్రం చేయించారు. దోమల నివారణ మందును ఆయనే స్వయంగా తరగతి గదులు, వంట గదుల్లో స్ప్రేచేశారు. మరుగుదొడ్లను సిబ్బందితో శుభ్రం చేయించి దోమలు వ్యాపించకుండా స్ప్రే చేయించారు. తాగునీటి ట్యాంకర్ శుభ్రం చేయించారు. అనంతరం మండల వైద్యాధికారి సూర్య శిల్ప తమ వైద్య సిబ్బందితో విద్యార్థులకు రక్త పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఎస్‌వో నాగరాణి, వీహెచ్ఎన్ రాములమ్మ, ఏఎన్ఎం పద్మావతి, పాఠశాల సిబ్బంది అనురాధ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే హత్య

నల్లగొండ క్రైం, ఆగస్టు 31 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను కడతేర్చింది భార్య. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగింది. నల్లగొండ వన్‌టౌన్ పరిధిలోని ఏఆర్‌నగర్(హైటెక్ కాలనీ)లో జరిగిన ఈ హత్య కేసును నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఛేదించారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కొలను శివరాంరెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాయపాడు గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న(50) నాలుగేళ్ల జిల్లా కేంద్రానికి వచ్చి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హైటెక్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుని కూలీ పని చేసుకుంటుండగా కొంతకాలంగా వెంకన్న భార్య మైసమ్మ నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన కండె భిక్షంతో వివాహేతర సంబంధం నెరుపుతోంది. ఈవిషయం చుట్టుపక్కల వారి ద్వారా వెంకన్నకు తెలియడంతో భార్య మందలించడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

ఆగస్టు 28వ తేదీన మైసమ్మ తన ప్రియుడు కండె భిక్షంతో సన్నిహితంగా ఉండడం చూసి ఆమె భర్త వెంకన్న వారిని పట్టుకుందామనే ప్రయత్నం చేయగా భిక్షం అక్కడి నుంచి పారిపోయాడు. ఈ క్రమంలో వెంకన్న భార్య మైసమ్మను కొట్టబోతుండగా వెంకన్నను ఆమెబలంగా నెట్టివేసింది. దీంతో రాయిపై పడగా అప్పటికే మద్యం మత్తులో ఉన్న వెంకన్నపై మైసమ్మ కూర్చుని గొంతు నులిమి హత్య చేసి ఆమె ప్రియుడు భిక్షం ప్రోద్భలంతో పారిపోయింది. పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న మైసమ్మ, ఆమె ప్రియుడు కండె భిక్షంను శనివారం జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న హరిత హోటల్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు సందీప్, ఏఎస్‌ఐ వెంకటనారాయణ, సిబ్బంది శ్రీకాంత్, షకీల్, తదితరులను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఇంటి మీది బెంగతో బీహార్ కూలీ ఆత్మహత్య

హుజూర్‌నగర్, ఆగస్టు 31 : ఇంటి మీద బెంగతో ఉమ్మెతకాయలు తిని బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు బలవన్మరణం చెందాడు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య వివరాలు వెల్లడించారు. రెండు నెలల క్రితం బీహార్ రాష్ట్రం దుర్గాపూర్ గ్రామానికి చెందిన పంచలాల్‌కుమార్(22) అనే యువకుడు నలుగురు వ్యక్తులతో కలిసి హమాలీ పనిచేసేందుకు హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామంలోని ఒక రైస్ మిల్లుకు వచ్చాడు. ఆగస్టు 27వ తేదీన మధ్యాహ్నం పంచలాల్‌కుమార్ ఇంటిమీది బెంగతో జీవితంపై విరక్తి చెంది రైస్‌మిల్లు పక్కనే ఉన్న ఉమ్మెంతకాయలు తిని పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మిల్లు గుమస్తా మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

రైలు కింద పడి యువతి...


వలిగొండ, ఆగస్టు 31 : రైలు కిందపడి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన మైత్రి పూజ(23) చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందగా గొల్నెపల్లిలో అమ్మమ్మ ఇంటి ఉంటోంది. మేనమామ బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లాడు. రెండేళ్ల కిందట వృద్ధురాలైన అమ్మమ్మ మృతి చెందింది. నాటి నుంచి పూజా ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది వలిగొండ- రామన్నపేట, రైల్వేస్టేషన్ నాగారం పరిధి 33/8-9 మైలు రాయి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


నల్లగొండ క్రైం, ఆగస్టు 31 : జిల్లాలోని పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 9 గ్రాముల బంగారం, రూ.8వేల విలువైన 1గ్రామ్‌గోల్డ్ ఆభరణాలు, 20 గ్రాముల వెండి ఆభరణాలు, 4 హుండీలు, రూ.54,500 నగదు, 2 సెల్‌ఫోన్లు, 2 ఆంప్లీఫయర్లు, ఆటో, ఇనుప రాడ్డు, రెండు ఫ్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలను వెల్లడించారు.తిప్పర్తి మండలం కేశరాజుపల్లి, అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన కత్తుల యాదయ్య, అదే గ్రామానికి చెందిన కత్తుల శివ డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం నల్లగొండ సీసీఎస్ పోలీసులు, మునుగోడు పోలీసులు సంయుక్తంగా మునుగోడు పీఎస్ పరిధిలోని జమస్తాన్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో యాదయ్య, శివ నల్లగొండ నుంచి మునుగోడు వైపు ఆటోలో వెళ్తుండగా పోలీసులు ఆపి విచారించారు. విచారణలో వీరు జిల్లాలోని సుమారు 14 ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. నిందితుల్లో శంకర్‌కు గతంలోనే నేర చరిత్ర ఉందని, జైలుకు కూడా వెళ్లి వచ్చాడన్నారు. జిల్లాలోని తిప్పర్తి, కనగల్, కట్టంగూరు, నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్, కనగల్, మునుగోడు, చండూరు, హాలియా, వేములపల్లి పీఎస్‌ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఎస్‌ఐ శివకుమార్, సీసీఎస్ హెచ్‌సీ విష్ణువర్ధన్‌గిరి, పుష్పగిరి, పీసీ అస్రర్ తదితరులను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

15 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

దేవరకొండ, ఆగస్టు 31: అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా దేవరకొండలో స్వాధీనం చేసుకున్నారు. శనివారం దేవరకొండ డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా గువ్వోనిపల్లి గ్రామానికి చెందిన కేశమోని జగదీష్‌గౌడ్ ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో దేవరకొండ పట్టణంలోని 12వ రేషన్‌డీలర్ ఊరకొండ సత్యనారాయణ రేషన్‌షాపు నుంచి ఈ నెల 29న రాత్రి బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సమాచారాన్ని డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్‌కు తెలపడంతో ఆయన శనివారం 12వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశాడు. తనిఖీల్లో 20 క్వింటాళ్లు తక్కువగా నిర్ధారణ అయ్యింది. దీంతో డీలర్ సత్యనారాయణతో పాటు బియ్యాన్ని కొనుగోలు చేసిన జగదీష్‌గౌడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు 6ఏ సెక్షన్‌పై కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ తెలిపారు.













స్తంభించిన జనజీవనం

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రాకపోక లకు అంతరాయం ఏర్పడింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయన్న వాతావరణ హెచ్చరికతో అధికారులు అప్రమత్తమయ్యారు.కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్ట్‌లలో అధికారులను నియమించారు. పంటపొలాల్లోకి నీరు చేరడమే కాకుండా లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పలుచోట్ల రహదారిపై నీళ్లు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పత్తి చేలు
- 24గంటలు షిఫ్ట్‌ల వారీగా అప్రమత్తంగా ఉండనున్న యంత్రాంగం


త్రిపురారం మండలం బాబుసాయిపేట వద్ద నీరు పొంగిపొర్లడంతో నిలిచిపోయిన రాకపోకలు

నల్లగొండ, ఆగస్టు 31: నల్లగొండ జిల్లాలోని అన్నిమండలాల్లోనూ వర్షం పడింది. కొండమల్లేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో 85.8 మిల్లీమీటర్ల(మి.మీ) భారీ వర్షం కురిసింది. చందపేటలో 84.8, అనుముల లో 82.5, నాంపల్లిలో 80.3, మర్రిగూడ 79.0, మునుగోడులో 75.0, తిరుమలగిరి(సాగర్)లో 73.8, అడవిదేవులపల్లిలో 73.5, శాలిగౌరారం 72.0, తిప్పర్తిలో 71.5, చండూరులో 69.8, నిడమనూరులో 69.5, గుర్రంపోడు 65.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అదే విధంగా 50 మిల్లీమీటర్లకు మించి నల్లగొండ, నేరేడుగొమ్ము, పీఏ.పల్లి, వేములపల్లి, పెద్దవూర, కనగల్, నల్లగొండ పట్టణం, దామరచర్లలో కురిసింది. మిర్యాలగూడలో అత్యల్పంగా మిర్యాలగూడలో 37.0మి.మీలుగా నమోదైంది. మాడ్గులపల్లి మండలం చిరుమర్తి, బొమ్మకల్, కల్వలపాలెం వాగుపై ఉన్న చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. చండూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భారీ వర్షానికి జలదిగ్బంధమైంది. శాలిగౌరారం మండలంలో పంటపొలాలు నీట మునిగాయి. భారీవర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ప్రభుత్వ కార్యాలయాలల్లో కంట్రోల్‌రూంలను ఏర్పాటుచేసింది.

నీట మునిగిన తాత్కాలిక వంతెన

త్రిపురారం: త్రిపురారం బాబుసాయిపేట మధ్యలో వాగుపై ఏర్పాటు తాత్కాలిక వంతెన వర్షాలకు శనివారం నీటిమునిగింది. దాంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. రెండేళ్లుగా రూ.2 కోట్లతో కొత్త వంతెనను నిర్మిస్తున్నారు. వాహన రాకపోకలకు తాత్కాలికంగా గూనలు వేసి మట్టి పోసి చిన్న పాటి వంతెన ఏర్పాటుచేశారు. ఎత్తు తక్కువగా ఉండటంతో చిన్న పాటి వర్షానికే నీటి ప్రవాహం పైనుంచి వెళుతోంది. ఈ రహదారి జడ్డర్ల-కోదాడ, అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారులకు అనుసంధానంగా ఉండటంతో వాహనాలు అధికంగా వెళుతుంటాయి. ప్రస్తుతం రహదారిలో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక వంతెనను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలన

బాబుసాయిపేట తాత్కాలిక వంతెనను ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. కొత్తవంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్. నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, గట్టు యాదగిరి తదితరులున్నారు.

వాయిదా పడిన ఐటీఎఫ్ అండర్-18 టెన్నిస్ ఫైనల్స్

భువనగిరి టౌన్ : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో శనివారం రోజంతా వర్షం కురిసింది. ప్రయాణికులకు, చిరు, వీధివ్యాపారులకు వర్షపు జల్లులు ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. భారీ వర్షంతో శనివారం జరుగాల్సిన ఐటీఎఫ్ అండర్ -18 టెన్నిస్ ఫైనల్స్‌ను వాయిదా వేసినట్లు ఐటీఎఫ్ పరిశీలకుడు శివకుమార్‌రెడ్డి తెలిపారు. వాయిదా పడిన అన్ని ఫార్మెట్ల ఫైనల్స్‌ను నిర్వహిస్తామన్నారు. అలాగే శనివారం ప్రారంభం కావాల్సిన ఐటీఎఫ్ వెటరన్ టెన్నిస్ సిరీస్ కూడా ఆదివారం నాటికి వాయిదా పడింది. వాయిదాతో క్రీడాకారులలో కాస్త నిరాశ నెలకొంది. అయితే ఆదివారం కూడా ఇదే తరహా వర్షం కురిస్తే ఫైనల్స్ ఫలితాలపై ప్రత్యామ్నయ మార్గాలు ఆలోచిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేటటౌన్: జిల్లాలో శనివారం రోజంతా వర్షం కమ్మేసింది. దీంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. అత్యధికంగా కోదాడలో 59.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా తిరుమలగిరిలో 10.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 29.6 మిల్లీమీటర్ల సరాసరి వర్షం నమోదైంది. సూర్యాపేట జిల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. జిల్లా కేంద్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్‌లో భారీ వర్షం కురిసింది. ఎక్కడిక్కడ వరదనీరు చేరింది. కోదాడ పట్టణంలో రహదారులపై నీరు నిలిచి ఉండడంతో వాహనాలు కదలేని పరిస్థితి కనిపించింది. కోదాడ మునిసిపల్ కార్యాలయంలోకి నీరు చేరడంతో పలు ఫైల్స్ తడిశాయి. హుజూర్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద చేరింది. నాగారం మండలంలోని ఫణిగిరి గుట్ట పైనుంచి జలపాతంగా గుట్ట కింద ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలోకి చేరింది.

నల్లగొండ జిల్లాలో...

నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ముఖ్యమైన కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంల ఫోన్‌నెంబర్లు.

కార్యాలయం	ఫోన్ నెంబర్
జిల్లా కలెక్టర్ కార్యాలయం	18004251442
ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయం	9440813326
ట్రాన్స్‌కో నల్లగొండ డివిజన్	9542451160
మిర్యాలగూడ డివిజన్	9493951399
దేవరకొండ డివిజన్	9440203717
నీటిపారుదల శాఖ కార్యాలయం	9989997950
నాగార్జునసాగర్ హిల్‌కాలనీ	8465080694
జీవి గూడెం	9912534475
పీఆర్	9059834706

విద్యుత్ వినియోగదారుల కోసం

నల్లగొండ కంట్రోల్ రూం	9440814326,
నల్లగొండ డివిజన్ కార్యాలయం	9542451160,
మిర్యాలగూడ	9493951399,
దేవరకొండ	9441139202

భువనగిరి జిల్లాలో

అధికారి	సెల్ నెంబర్
ప్రదీప్‌రెడ్డి	9010107810
కె కుమార్	9885267004
కె రాజు	9398915335

యాదగిరిగుట్టలో

కిరణ్‌బాబు	9182601092
కుమార్	8977538819

సూర్యాపేట జిల్లాలో ..

కలెక్టరేట్‌లో	6281492368

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

మూడు రోజులు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామస్థాయి అధికారుల వరకు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌తో పాటు ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మునిసిపల్ మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయడంతో పాటు 24గంటలు పనిచేసేలా మూడు షిఫ్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. పాతబడిన ఇండ్లు కూలీపోయే ప్రమాదం ఉందని అలాంటి ఇంటి నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలల్లో ఉంచాలన్నారు. పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.


రేకుల కింద కుమార్తెలతో వెంకటమ్మ

ఆమే ఆధారం..
నిలువ నీడ లేని జీవితం

ఇంటిపెద్దలేని కుటుంబం. మానసిక స్థితి బాగాలేని ఎదిగిన ఇద్దరు ఆడ పిల్లలు.. ఓ కుమారుడు. కుటుంబ బాధ్యత అంతా ఆమెపైనే.. రెండు రేకుల కింద ఇల్లు.. ఎండొచ్చినా, వానొచ్చినా పొరిగింటి వరండానే ఆవాసం.. ఇదీ నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రానికి చెందిన సిగపట్ల వెంకటమ్మ దీన స్థితి. భారీ వర్షాలతో శనివారం ఓ దుకాణ వరండాలో తలదాచుకుంటున్న ఆ ముగ్గురినీ చూసి అంతా చలించిపోయారు.

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 31 : నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రానికి చెందిన సిగపట్ల మట్టయ్య, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 15 ఏళ్ల కిందట మట్టయ్య మద్యానికి బానిసై చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ భారం వెంకటమ్మపై పడింది. మట్టయ్య ఉన్న కాలంలో సొంత స్థలంలో ఓ గుడిసెలో ఉండేవారు. ఆయన మృతితో మరింత ఇబ్బందుల్లో పడ్డారు. ఈ క్రమంలో ముగ్గురు పిల్లలతో వెంకటమ్మ ఇబ్బందిని చూసి స్థానికుడైన కానిస్టేబుల్ గురునాథం ఇంటి నిర్మాణంలో కొంత సాయాన్ని ముందుకొచ్చారు. ఆ సమయంలో బునాది వరకు పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత సహాయానికి ఎవరూ ముందుకు రాకపోవడం, వెంకటమ్మ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో బునాదిని ఆనుకుని ఉన్న ఖాళీలో స్థలంలో రెండురేకులు, పరదాలతో కట్టిన గుడారంలో ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటోంది. ఇద్దరికి మినహా మరొకరు కూడా ఉండేందుకు వీలులేని ఆ గుడారంలోనే కుటుంబాన్ని వెంకటమ్మ కుటుంబాన్ని నడిపిస్తోంది. ఎండవచ్చినా, వానవచ్చినా తలదాచుకునేందుకు చుట్టుపక్క వారి వరండాలో ఉంటూ కాలం వెళ్లదీస్తోంది. ఇద్దరు మానస్థితి స్థితి లేని కుమార్తెలు కావడం, కుమారుడితో జీవనం దుర్భరంగా మారింది. ఈ క్రమంలో శనివారం కురిసిన భారీ వర్షానికి కురుస్తున్న గుడారంలో ఉండే వీలులేక ఆరుబయట ఓ దుకాణం ఎదుట తలదాల్చుకున్నారు. వీరి పరిస్థితిని చూసి స్థానికులు తలదాచుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నా భర్త చనిపోవడంతో కుటుంబభారం అంతా నాపై పడింది. బతుకుదెరువు కోసం పలువురి ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నా. ఇరుగుపొరుగు సాయంతో కాలం వెళ్లదీస్తున్నాం. మానసిక స్థితిలేని నా కుమార్తెలకు పింఛను ఇప్పించడంతో పాటు తలదాచుకోవడానికి ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా.

\- వెంకటమ్మ

ప్రవాహం అంచున ప్రమాదం

- సెల్ఫీ కోసం కాల్వలోకి వెళ్తున్న బాటసారులు
- మద్యం మత్తులో మరికొందరు మృత్యుఒడిలోకి
- ప్రమాదాలకు నిలయంగా సాగర్ కాల్వ వంతెనలు
- వరుస ఘటనలు జరుగుతున్నా చర్యలు శూన్యం

నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రం వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆహ్లాదకర వాతావరణం, ఆకట్టుకునే కాల్వ ప్రదేశాన్ని చూసి అటుగా వెళ్లే వారు మంత్రముగ్ధులై ఆగిపోవాల్సిందే. ఆ అందాలను బంధించేందుకు సెల్ఫీ దిగితే బాగుంటుంది కదా అనే ఆలోచన వస్తోంది. స్మార్ట్‌ఫోన్ పుణ్యమా అని సెల్ఫీల సరదా పెరిగింది. సెల్ఫీ దిగుదామని కాల్వలో దిగి బాటసారులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీనికి తోడు మద్యం మత్తులో నీటమునిగి మృత్యువాత పడుతూ కన్నీటిని మిగులుస్తున్నారు మరికొందరు.

\- వేములపలి


ఎడమకాల్వ మెట్లపై సెల్ఫీ దిగుతున్న యువకులు, ఆగస్టు 30న సెల్ఫీ తీసుకుంటూ కాల్వలో పడిన మహిళను కాపాడుతున్న స్థానికులు

వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై పెద్దసంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికంగా ఉన్న ఎడమకాల్వ నీటి విడుదల సమయంలో వాహనదారులను ఆహ్లాదపరుస్తుంటుంది. దీంతో వాహనదారులు ఆ ఆహ్లాదకర వాతావరణాన్ని గడిపేందుకు తమ వాహనాలను ఆపుతుంటారు. కాల్వ నీటిని తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు సెల్ఫీలు తీసుకునే క్రమంలో మృత్యుఒడిలోకి జారుకుంటున్నారు. వరద ధాటికి ప్రాణాలు కోల్పోతున్నారు.

హెచ్చరికల బోర్డులతోనే సరి

వేములపల్లిలో రెండు వంతెనల వద్ద ఎలాంటి రక్షణ వలయాలు ఏర్పాటుచేయలేదు. కేవలం ఒకట్రెండు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతోనే సరిపెట్టారు. దీంతో నిత్యం ఏదో ఒక సంఘటన చోటుచేసుకుంటుంది. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా గతంలో ఉన్న వంతెనకు సమాంతరంగా మరో వంతెన నిర్మించినా ఎలాంటి రక్షణ గోడలు నిర్మించకపోగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. బ్రిడ్జి సమీపంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే క్రమంలో వాహనాలు వేగంగా బ్రిడ్జిపైకి చేరుకుంటుంటాయి. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా నేరుగా సాగర్ ఎడమకాల్వలోకి దూసుకెళ్లే అవకాశం లేకపోలేదు. ఎంతో ప్రమాదకరమైన ఈ ప్రదేశంలో నామమాత్రంగా రక్షణ గోడ నిర్మించి కేవలం ఒకేఒక హెచ్చరికబోర్డును ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. మరోవైపు మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని బీమారం- సూర్యాపేట రహదారిపైగల ఎడమకాల్వ బ్రిడ్జి సైతం మృత్యునిలయంగా మారింది. బ్రిడ్జికి సమీపంలోనే మద్యం దుకాణం ఉండటం మద్యం ప్రియులు మత్తులో బ్రిడ్జి మెట్లపై కూర్చుని మద్యం సేవిస్తూ మద్యం మత్తులో ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణ సమయంలో సైతం బ్రిడ్జిల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదాలకు నిలయంగా బ్రిడ్జిలు మారుతున్నాయి. మరోవైపు గణేష్ నవరాత్రి ఉత్సవాల సమయంలో సమీప మండలాల నుంచి భారీగా వినాయకులను మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వకు నిమజ్జనానికి తరలిస్తుంటారు. ఈ సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మద్యం మత్తులో

మిర్యాలగూడ పట్టణానికి వేములపల్లిలోని ఎడమకాల్వ సమీపంలో ఉండటంతో యువకులు సరదాగా ఈత కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ క్రమంలో తమవెంట మద్యాన్ని తెచ్చుకుని మద్యం మత్తులో కాల్వనీటి ప్రవాహాన్ని అంచనా వేయలేక గల్లంతై కన్నవారికి కడుపుకోత మిగుల్చుతున్నారు. వీరికి తోడు వివిధ కారణాలతో కొందరు బ్రిడ్జి సమీపంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. పలువురు ఈత వచ్చన్న ధీమతో సాగర్ కాల్వలోకి దిగుతున్నారు. కాల్వ నీటి ప్రవాహ ఉధృతికి గల్లంతవుతున్నారు. అదేవిధంగా ఈ రహదారి గుండా వెళ్లే ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు సరదా కోసం కాల్వలోకి వెళ్లి జలసమాధి అవుతున్నారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సాగర్ ఎడమకాల్వ వంతెన బాటసారులకు మృత్యుమార్గంగా మారుతున్నా రక్షణ చర్యలను చేపట్టడంలో మాత్రం ఎన్ఎస్‌పీ, ఆర్‌అండ్‌బీ, పోలీస్ యంత్రాంగం విఫలమవుతున్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

సాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో పలుగ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు, వాగులు, వంకలు, చెరువుల వద్ద బ్రిడ్జిల నిర్మాణాన్ని చేపట్టారు. దశాబ్దాల కిందట చేపట్టిన ఈ బ్రిడ్జిలకు ఏర్పాటుచేసిన రెయిలింగ్‌లు, రక్షణ దిమ్మెలు, గోడలు దెబ్బతినిపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో సాగర్ ఎడమకాల్వపై గతంలో పోలిస్తే వాహనాల రద్దీ పెరగడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, కల్వర్టులు, బ్రిడ్జిల సమయంలో చేరుకున్న సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టుల సమీపంలో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా రక్షణ చర్యలు చేపట్టడంలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమమవుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు చేపడుతున్నాం

వేములపల్లి మండలంలోని సాగర్ ఎడమకాల్వపై బ్రిడ్జిల వెంట ప్రమాదాలు చోటుచేసుకోకుండా సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తున్నాం. కాల్వలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహనదారులు, బాటసారులు కాల్వలోకి వెళ్లకుండా సమీప గ్రామాలతోపాటు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. బ్రిడ్జిల సమీపంలో మెట్ల వద్ద రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

\- విజయ్‌కుమార్, ఎస్ఐ

కొంతకాలంగా చోటుచేసుకున్న సంఘటనలు

- 2019 ఫిబ్రవరి 4న నల్లగొండ పట్టణానికి చెందిన వివాహిత అనారోగ్య సమస్యతో శెట్టిపాలెం వద్ద బ్రిడ్జి వద్ద కాల్వలోకి దూకగా గమనించిన స్థానికులు ఆమెను కాపాడి కుటుంబసభ్యులకు అప్పగించారు.
- 2019ఏప్రిల్ 7న చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన కప్పల లింగయ్య ఆయన కుమారుడు శ్రీమణికాంత్‌తో కలిసి దామరచర్లకు వెళ్లివస్తున్నాడు. వేములపల్లిలోని సాగర్ ఎడమకాల్వ నీటికి ఆకర్షితులై బైక్‌ను ఆపి సెల్ఫీలు దిగుతూ కాల్వలోకి దిగి మృత్యువాతపడ్డారు.
- 2019 అక్టోబరు 29న శెట్టిపాలెం గ్రామానిక చెందిన సకినాల అంజయ్య వేములపల్లి శివారులో కాల్వలోకి దిగి గల్లంతై మృత్యువాతపడ్డాడు.
- 2019 డిసెంబరు 20న హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఒంటేరు నిశిత్‌రెడ్డి స్నేహితులతో మిర్యాలగూడలో సరదాగా గడిపేందుకు వచ్చి పార్టీ చేసుకునేందుకు శెట్టిపాలెం సమీపంలోని సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జి వద్దకు చేరుకుని కాల్వలోని నీటిని చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యుఒడిలోకి చేరుకున్నాడు.
- 2020 సంవత్సరం 22న మిర్యాలగూడలో ఉంటున్న ఖమ్మం జిల్లా మణుగూరుకు చెందిన పిల్లి సంజయ్‌రామ్ ఉదయం స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడి ఈతకై శెట్టిపాలెం సమీపంలోని బ్రిడ్జి వద్దకు వెళ్లి నీటి ప్రవాహ ఉధృతిలో మృత్యువాతపడ్డాడు.
- ఆగస్టు 19న తన మేనమామ వివాహ వేడుకలకు వచ్చి సాగర్ ఎడమకాల్వలో బట్టలు ఉతికేందుకు తల్లి, బంధువులతో కలిసి సూర్యాపేట జిల్లా కుసుమవారిగూడెంకు చెందిన పోతురాజు తేజశ్రీ(14) ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృత్యువాతపడింది.
- ఆగస్టు 30న ఓ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తూ సాగర్ నీటి ప్రవాహానికి ఆకర్షితులైంది. కారును ఆపి కుటుంబసభ్యులతో కలిసి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించే క్రమంలో కాలు జారి కాల్వలో కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు తాళ్ల సహాయంతో కాపాడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

సరదాగా సాగర్ చూసొద్దాం

- పర్యాటకులకు కనువిందు చేస్తున్న సాగర్
- బౌద్ధ చరిత్రకు సజీవ సాక్ష్యం నాగార్జునకొండ, బుద్ధవనం

ప్రపంచ పర్యాటక కేంద్రంతో పాటు అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్‌కు నెల రోజులుగా ఎగువ నుంచి వరద వచ్చి చేరడంతో నిండుకుండలా మారింది. దీంతో సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సాధా రణంగా సాగర్‌కు పర్యాటకులు ఎడాది పొడవునా వస్తూనే ఉంటారు. ప్రస్తుతం క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. దట్టమైన నల్లమల అడవి గుండా ప్రయాణిస్తూ సాగర్‌కు చేరకునే పర్యాటకులు సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలను గురించి 'ఆంధ్రజ్యోతి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

\- నాగార్జునసాగర్

సాగర్ ప్రధాన డ్యాం

ప్రపంచంలోనే మానవ నిర్మిత అద్భుత కట్టడం నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన మానవ నిర్మిత రాతికట్టడం. ప్రాజెక్టుకు ఏర్పాటుచేసిన 26 క్రస్ట్‌గేట్లను ఎగువ నుంచి వరద వచ్చినప్పుడు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఈ నీటి విడుదల సమయంలో కృష్ణమ్మ తెల్లని పాల పొంగుల వలె దిగువకు జాలువారుతుంటుంది. ఈ సుందర మనోహర దృశ్యం చూపరులను ఆకట్టుకుంటుంది.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం

సాగర్ ప్రధానడ్యాం దిగువనే ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు.ఈ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కోసం మొత్తం ఎనిమిది టర్బైన్లను ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లి చూడాలంటే జెన్‌కో సీఈ అనుమతి తీసుకోవాలి.

బుద్ధవనం

సాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో బుద్ధవనాన్ని నిర్మించారు.ఈ వనంలో బుద్ధుడి జననం నుంచి మరణం వరకు బొమ్మల రూపంలో కళ్లకు కట్టినట్లుగా చిత్రాలను నిర్మించారు. ఇందులోకి పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50లు ప్రవేశ రుసుం. పర్యాటకుల కోసం 6 కాటేజీలు ఉన్నాయి. వివరాలకు 9705815303 నంబరును సంప్రదించాలి.

నాగార్జునకొండ

సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ మత ఆనవాళ్లను సాగర్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో సాగర్ జలాశయం మధ్యలో 144 ఎకరాల్లో నాగార్జునకొండపై ఏర్పాటు చేశారు. బౌద్ధ మత స్తూపాలను, నమూనాల కోసం ఇక్కడ మ్యూజియంను నిర్మించారు. ఇక్కడకు వెళ్లాలంటే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయ విహార్ అతిథి గృహం వెనక వైపున ఉన్న లాంచీ స్టేషన్ నుంచి ప్రతి రోజూ ఉదయం 9:30 గంటలకు, మధ్యాహం 1:30గంటలకు లాంచీలు వెళతాయి(ప్రతీ శుక్రవారం మ్యూజియానికి సెలవు). ఇందుకు పెద్దలకు రూ.200, పిల్లకలు రూ.150 చొప్పున టికెట్ ఉంటుంది(12 ఏళ్ల లోపు వారికి). అలాగే మ్యూజియం టికెట్ 15 ఏళ్ల వయస్సుపైన వారికి రూ.30 చొప్పున వసూలు చేస్తారు.


విదేశీ పర్యాటకులకు రూ.350లు వసూలు చేస్తారు.

బౌద్ధ మత ఆనవాళ్లకు నెలవు అనుపు

సాగర్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో రైట్ బ్యాంకు వద్ద అనుపు ఉంటుంది. ఇక్కడ అలనాటి నాగార్జున విశ్వవిద్యాలయం, నమూనాలు, హండీ స్టేడియం, ఇక్ష్వాకుల కాలం నాటి బౌద్ధ ఆనవాళ్లు రంగనాథస్వామి ఆలయం ఉన్నాయి.

మదిని దోచే ఎత్తిపోతల జలపాతం

సాగర్ నుంచి మాచర్లకు వెళ్లే దారిలో 7వ మైలు వద్ద ఎత్తిపోతల జలపాతం ఉంటుంది. ఇక్కడ 300 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు పడుతూ ఉంటుంది. ఈ సుందర మనోహర దృశ్యం పర్యాటకుల మదిని దోచేస్తుంది. ఇందుకు గాను పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20లు టికెట్ ధర ఉంటుంది. ఇక్కడ రాత్రి బస చేయడానికి ఎనిమిది గదులు అందుబాటులో ఉన్నాయి. వివరాలకు 9441453115 నంబరును సంప్రదించాలి.

అర్బన్ పార్కు

సాగర్ సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క-సారక్క ఆలయం వద్ద అర్బన్ పార్క్‌ను ఏర్పాటుచేశారు. ఇది 950 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడ అడవి జంతువులను చూసేందుకు సఫారీ ట్రిప్పును కూడా ఏర్పాటుచేశారు. ఇందుకు 10కిలోమీటర్లు అడవిలోకి వెళ్లాలంటే ఒక్క ట్రిప్పుకు రూ.1000, 24 కిలో మీటర్లు లోపలికి వెళ్లాలంటే రూ.1500 టికెట్ ధర ఉంటుంది.

పర్యాటకులకు రాత్రి బసకు సౌకర్యాలు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి సాగర్‌కు వచ్చే పర్యాటకులు రాత్రి బస చేయడానికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవిహార్ అతిథి గృహం, ప్రాజెక్టు హౌస్, యూత్ హాస్టల్‌తో పాటు ప్రైవేట్ అతిథిగృహాలు, పార్క్ ఇన్, శ్రీనివాసా రెసిడెన్సీ, టైగర్ వ్యాలీ హోటళ్లు ఉన్నాయి. విజయ విహార్‌లో గదులను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాలి. ఫోన్ నెంబరు 08680-277362ను సంప్రదించాలి. స్థానికంగా ఉన్న ప్రైవేటు అతిథి గృహాలల్లో కూడా గదులు అద్దెకు లభిస్తాయి.

సాగర్‌కు చేరుకోవాలంటే

నాగార్జునసాగర్‌కు చేరుకోవాలంటే హైదరాబాద్ నుంచి 150కిలోమీటర్లు బస్సులో ప్రయాణం చేస్తే నేరుగా సాగర్‌కు చేరుకోవచ్చు. ఏపీ, తెలంగాణ బస్సులు అరగంటకు ఒకటి ఉంటాయి.

- నల్లగొండ నుంచి సాగర్‌కు 60 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నల్లగొండ- మాచర్ల బస్సులు సాగర్ మీదుగా వెళతాయి.
- ఏపీలోని గుంటూరు నుంచి 150 కిలోమీటర్ల దూరంలో సాగర్ ఉంటుంది. ఇక్కడకు రావాలంటే మాచర్లకు చేరుకుని అక్కడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో సాగర్‌కు చేరుకోవచ్చు.

సాగర్‌కు భారీ వరద


నాగార్జునసాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, ఆగస్టు 31: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద వస్తోంది. గత నెలలో (జూలై) 3.40లక్షల క్యూసెక్కుల వరద రాగా, శనివారం ఎగువనుంచి 4,74,359 (రాత్రి తొమ్మిది గంటలకు) క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఈ సీజన్‌లోనే ఇదే అత్యధికం. దీంతో సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 3వ రోజు కూడా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువనుంచి 3,54,735 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 885 అడుగులుగా(215.8070టీఎంసీలుగా) ఉంది. దీంతో ప్రాజెక్టు మొత్తం 12 క్రస్ట్‌గేట్లలో 2 క్రస్ట్‌గేట్లను 10 అడుగులు, 8 క్రస్ట్‌గేట్లను 18 అడుగుల మేరకు ఎత్తి 4,06,250 క్యూసెక్కులు, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,227 క్యూసెక్కులు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 4,74,359 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589అడుగులుగా(309.0570టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,292 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5,510 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,460 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 4,12,078 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తంగా 4,53,700 నీరు విడుదలవుతోంది. ఎగువ నుంచి 4,74,359 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీ 5 గేట్ల ఎత్తివేత

మూసీ ప్రాజెక్టుకు శనివారం వరద నీటి రాక పెరిగింది. శనివారం ఉదయం నుంచి క్రమంగా ఇన్‌ఫ్లో పెరుగుతూ వచ్చింది. సాయంత్రానికి 2,373 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో రాత్రి 9గంటల ప్రాంతంలో 5,500క్యూసెక్కులుగా నమోదయ్యింది. దీంతో అప్పటికే అక్కడ అప్రమత్తంగా ఉన్న ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ప్రాజెక్టు 2, 4, 7, 8తో పాటు మరో క్రస్టుగేట్‌ను నాలుగు అడుగు మేర ఎత్తి 3,500 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు వచ్చే వరద ఉధృతి ఎక్కువ అవుతుండడంతో రాత్రి పొద్దుపోయాక మరిన్ని గేట్లు ఎత్తే వీలుంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.80అడుగులు(4.15 టీఎంసీ)లుగా ఉంది. నాలుగు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్న అధికారులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాల పరిధిలో గల మూసీ పరివాహక గ్రామాల ప్రజలకు వాట్సాప్ గ్రూప్ మెసేజ్‌లు, సోషల్ మీడియా ద్వారా అప్రమత్తం చేశారు.

టెయిల్‌పాండ్ నుంచి నీటి విడుదల

దామరచర్ల: నాగార్జునసాగర్ నుంచి దిగువకు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో అడవిదేవులపల్లి మండల కేంద్రం శివారులోని టెయిల్ పాండ్ నుంచి శనివారం అదే స్థాయిలో అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. 14 గేట్లను 4.5 మీటర్లు ఎత్తి 3,28,888 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రోజంతా జోరువాన

- పట్టణాల్లో ప్రధాన వీధులు జలమయం
- వాననీటితో నిండిన లోతట్టు ప్రాంతాలు
- పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందులు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- అలుగులు పోసిన చెరువులు


నల్లగొండ జలమయమైన ప్రకాశంబజార్


నార్కట్‌పల్లిలో నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద నిలిచిన వరద నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. శనివారం ఉదయం నుంచి ఆగకుండా వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరుతుంది. కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. వర్షం కురవడంతో జనజీవనానికి తీవ్ర ఆంటకం కలిగింది. పంట పొలాలు నీటిలో మునిగి పోయాయి. కొన్ని ప్రాంతాల్లో వరిచేను నెలకొరిగింది. పలు పంట పొలాలు నీటిలో మునిగాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, కూలీలు నాట్లు చేసేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

● మాడ్గులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై వర్షపునీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఒకవైపు నుంచే వాహనాల రాకపోకలు కొనసాగాయి. అధికారులు రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని చిరుమర్తి, ఆగామోత్కూర్, బొమ్మకల్, కల్వలపాలెం చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని తిరుమలగిరి పెద్దచెరువు అలుగు పోస్తుంది. బడాయిగడ్డ వద్ద రోడ్డుపై వర్షపు నీరు ప్రవహిస్తుంది.

● కేతేపల్లి మండలంలో 42మి.మీ వర్షపాతం నమోదైంది. జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీసు రోడ్లపై నీరు నిలిచింది. అండర్ పాసింగ్ వంతెన కింద పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

● దేవరకొండ డివిజన్‌లో భారీ వర్షం కురిసింది. దేవరకొండ, కొండమల్లేపల్లి, నాంపల్లి, పీఏపల్లి, చందంపేట, డిండి మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షాకాలం సీజన్‌లో భారీ వర్షం కురవడం ఇదే మొదటిసారి కావడంతో పత్తి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండలో 55 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దేవరకొండ డివిజన్‌లో ఇప్పటివరకు లక్ష 20వేల ఎకరాల వరకు పత్తిపంట సాగు చేశారు. దేవరకొండ మండలం తాటికోలు వాగు ఎగువ భాగాన భారీ వర్షం కురియడంతో రెండేళ్ల తర్వాత వాగు పొంగిపొర్లుతుంది. పాత ఇళ్లలో ఉండవద్దని మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వర్షంపై అంచనా వేస్తున్నామని ఎలాంటి నష్టం జరగలేదని తహసీల్దార్ సంతోష్‌కిరణ్ తెలిపారు. వర్షంతో ఉర్దూ మీడియం పాఠశాలలోకి చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

● చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండటం, నీరు ప్రవహించే దారిలేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ జలమయంగా మారుతుంది. పట్టణమంతా నీటితో మునిగిపోయింది. పట్టణ శివారులో ఉన్న వాగులు పొంగి పొర్లుతుండటంతో ప్రైవేట్ పాఠశాలలు మధ్యాహ్నం సెలవు ప్రకటించాయి. ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. శనివారం నుంచి ఈ నెల 2వ తేదీ వరకు అధికారులు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

● నార్కట్‌పల్లిలో వాన దంచికొట్టింది. జిల్లాలోనే రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. సుమారు 8.8సె.మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు ప్రకటించారు. నార్కట్‌పల్లి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అసంపూర్తి రోడ్డు విస్తరణ పనుల కారణంగా నల్లగొండ క్రాస్‌రోడ్డు మోకాల్లోతు వద్ద వరదనీరు నిలిచింది. ఎగువ బస్టాండ్ నుంచి వచ్చిన వరదనీరు దిగువకు వెళ్లడానికి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కురిసిన వాన నీరంతా క్రాస్ రోడ్డుపైనే నిలిచి వాహనచోదకులు, పాదచారులు నానాఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు వ్యాపారస్థుల సముదాయాల్లోకి నీరు చేరి కొంత నష్టం చేకూర్చింది. అదేవిధంగా మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలోని దళిత కాలనీల్లో కూడా లోతట్టు ప్రాంతాలు జలయమయమయ్యాయి.

● మిర్యాలగూడ పట్టణంలో కురిసిన భారీ వర్షంతో కాలనీలన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, విద్యుత్ కార్యాలయాల్లో వరదనీరు చేరడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. రాజీవ్‌చౌక్, సీతారాంపురం, షాబూనగర్, తాళ్లగడ్డ తదితరల ప్రాంతాలు వర్షపు నీటితో నిండి జలపాతాలను తలపించాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులకు వర్షం ఆటంకం కలిగించింది.

● కట్టంగూరు మండలంలోని ఎర్రసానిగూడెం వద్ద ఉన్న వాగులో నీరు ఉధృతంగా రావడంతో ప్రజలు వాగు దాటడానికి ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు మండలంలోని కుమ్మరిగూడెం, ఈదులూరు మధ్యన ఉన్న వాగులోకి నీరు రావడంతో ప్రవహిస్తుంది. కట్టంగూరు నుంచి మీరాసాహెబ్ గూడెం వెళ్లే వాగుకు వరద వచ్చింది.

● అనుముల మండలంలో రోజంతా ముసురుతో జనజీవనం స్తంభించింది. పంట పొలాల్లో నీళ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరుతో వాగులు ఉధృతం గా ప్రవహిస్తున్నాయి. పేరూరు చెరువు అలుగుపోయడంతో ప్రధాన రహదారిపై నీరు వెళ్తుంది.

● వేములపల్లి మండలంలో 50.8మి.మీ వర్షపాతం నమోదైంది. పలు ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

● నిడమనూరు మండలంలోని శాఖాపురం గ్రామంలో సాగర్ జలాలు రోడ్డెక్కాయి. నారెళ్లగూడెం మేజర్ కాల్వకు పూర్తి స్థాయిలో 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అంతేకాక రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో కృష్ణాజలాలు గ్రామంలోని రహదారుల మీదుగా ప్రవహించాయి. పలువురి ఇళ్లలోకి కూడా వరద నీరు చేరింది. మేజ ర్ కాల్వ నీరు గ్రామంలోకి చేరిందన్న విషయం తెలుసుకు న్న నీటి పారుదల అధికారులు కాల్వకు నీటి విడుదల 20 క్యూసెక్కులకు తగ్గించారు. వరదనీరు తగ్గుముఖం పట్టగానే మేజర్ కాల్వకు అవసరమైన నీటిని విడుదల చేయనున్నట్లు ఐబీ ఏఈ ప్రవీణ్‌రాజ్ తుమ్మడం చిన్నచెరువు కత్వా మీదుగా అలుగుపోస్తుంది.

● శాలిగౌరారం మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయం కాగా, పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. పలు చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. మండలంలోని ఉప్పలంచ, రామానుజపురం, కొత్తపల్లి గ్రామాల్లో చెరువులు ఈ పాటికే నిండి అలుగుపోస్తుంది. శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 15 అడుగుల నీటిమట్టం ఉంది.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పలు వార్డులలోని కాలనీలలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాలనీల్లో చేరిన వర్షపు నీరు కుంటలను తలపిస్తున్నాయి.


దేవరకొండ: రెండేళ్ల తర్వాత వర్షానికి పొంగుతున్న తాటికోలు వాగు


జగదిగ్బంధంలో నల్లగొండలోని అర్బన్ ఆస్పత్రి


నిడమనూరు: శాఖాపురంలో రోడ్ల మీదుగా ప్రవహిస్తున్న సాగర్ జలాలు


తిరుమలగిరి మండల కేంద్రంలో అలుగుపోస్తున్న పెద్ద చెరువు

డిండి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందిస్తాం

- ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, ఆగస్టు 31: డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ వానాకాలం సాగుచేసిన పంట చేలకు పంటకాలం పూర్తయ్యే వరకు ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. డిండిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. డిండి రిజర్వాయర్ నీటిమట్టం తగ్గిన విషయాన్ని ముఖ్యమంత్రి, నీటి పారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వారు కల్వకుర్తి ఎత్తిపోతల నీటి ద్వారా డిండి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. డిండి రిజర్వాయర్ ఆయకట్టులో ఈ వానాకాలం సాగుచేసిన వరి పైర్లు ఒక ఎకరం కూడా ఎండిపోకుండా కాపాడే బాధ్యత తనదేనని రైతులకు భరోసా ఇచ్చారు. ఆయకట్టు పరిధిలోని 12,500 ఎకరాలను నీరు ఇచ్చి కాపాడుతామన్నారు. ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రికి దేవరకొండ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడమే ఏబీవీపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

రామగిరి, ఆగస్టు 31: విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఏబీవీపీ లక్ష్యమని ఆ సంఘం క్షేత్ర సంఘటన మంత్రి చిరిగే శివకుమార్ అన్నారు. పట్టణంలోని ఏచూరి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదుగురితో ప్రారంభమైన ఏబీవీపీ 50 లక్షల మంది విద్యార్థుల కలిగిన అతిపెద్ద విద్యార్థి సంఘంగా విరాజిల్లుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, ప్రముఖులు ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

డి-40 ద్వారా నీటిని విడుదల చేయాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 31: డి-40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల రైతులు కోరారు. నల్లగొండలోని సీఈ అజయ్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయ సముద్రం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా డి-40కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు సాగు చేస్తున్న పంట పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. అధికారులు నీటి విడుదలను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విస్తృతంగా చేయాలి : వీరెల్లి

నార్కట్‌పల్లి, ఆగస్టు 31: ప్రతీ బూత్‌కు 200ల చొప్పున మండలంలో కనీసం 15వేలు తగ్గకుండా పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదుపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం రైతులకు పంట రుణాలను మాఫీ చేయడంలో విఫలమైందని అన్నారు. దేశంలో సుస్థిరపాలన కేవలం బీజేపీతోనే సాధ్యమని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు పజ్జూరి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, సామ హర్షవర్ధన్‌రెడ్డి, రవి, సతీష్, లింగస్వామి, రమేష్, శివశంకర్, లాలూప్రసాద్, సందీప్, శివ, దినేష్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : నాగం

చిట్యాలరూరల్, ఆగస్టు 31: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలంలోని బొంగోనిచెర్వులో పార్టీ జెండాను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. పార్టీ చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. సమావేశంలో నాయకులు రూపని లింగస్వామి, వెల్ది రాఘవరెడ్డి, అంశల అనిల్ కుమార్, జమాండ్ల నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదిరెడ్డి, నవీన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

చందంపేట, ఆగస్టు 31: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామంలో శ్రీసీతారామస్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని గుడి నిర్మాణ దాత మురళీధర్‌రెడ్డి దంపతులను అభినందించారు. గుడి నిర్మాణానికి మరింత సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీచైర్మన్ ముక్కమళ్ల బాలయ్య, మాజీ సర్పంచ్ బషీర్, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

3న సాయుధ రైతాంగ పోరాట శౌర్యయాత్ర

చిట్యాలరూరల్, ఆగస్టు 31: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 3వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో రైతాంగ పోరాట శౌర్యయాత్రను చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ తెలిపారు. మండలంలోని గుండ్రాంపల్లిలో శనివారం శౌర్యయాత్ర ప్రచార పత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాయిధ రైతాంగ పోరాటానికి గుండ్రాంపల్లి చరిత్రే సాక్ష్యమన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న శౌర్యయాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీను, లింగస్వామి, జహంగీర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వర్ష బాధితుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు

దేవరకొండ, ఆగస్టు 31: దేవరకొండ డివిజన్‌లో భారీ వర్షాల కారణంగా ఏమైనా నష్టపోయిన వారు వెంటనే దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలోని కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆర్డీవో శ్రీరాములు తెలిపారు. డివిజన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షం కారణంగా ఏమైనా సమస్యలుంటే 9848407387, 08691298155 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆర్డీవో కోరారు.

● **చండూరు రూరల్:** చండూరు ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో (ఎంపీవో) మాధవరెడ్డి తెలిపారు. కంట్రోల్ సెల్‌లో రాము, నజీర్ నెంబర్ 9505415411, 9985633122 అందుబాటులో ఉంటారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఫోన్ చేయాలన్నారు.

● **నల్లగొండ రూరల్:** ప్రజల కోసం, అత్యవసర సహాయం కోసం జిల్లా కేంద్రంలోని నల్లగొండ ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ లైన్ సెంటర్, కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎన్.రవి తెలిపారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూం 24 గంటలు ప్రజలకు సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్‌లో అధికారులు కె.వెంకటేష్ 9010670408, ఎం.నాగేశ్వరరావు 8074522583 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

● **రామగిరి:** నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. పట్టణ ప్రజలకు ఏవైనా సమస్యలు వస్తే 08682220200 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కంట్రోల్ రూంలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అత్యవసర సహాయం కోసం కార్యాలయంలో డి.శివకుమార్ 9885172336, డి.కృష్ణ 9542892278 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి రాష్ట్రీయ పోషణ మాసం

నల్లగొండ టౌన్, ఆగస్టు 31: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలో, సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రీయ పోషణమాసాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి తెలిపారు. ఈ పోషణమాసం కార్యక్రమాలు నిర్దేశించబడిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మొదటి వారంలో రక్తహీనత అనే అంశం ఆధారంగా పిల్లల కోసం రక్త హీనత శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

నేడు ఉమ్మడి జిల్లా యోగా సెలక్షన్స్

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 31: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సెలక్షన్ నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంభం నర్సిరెడ్డి, ఎస్.రాజశేఖర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాలల్లో సెలక్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ఉదయం 10 గంటలలోపు ఇండోర్ స్టేడియంలో హాజరు కావాలని వారు కోరారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురు అరెస్టు

- 140 గ్రాముల గంజాయి
- రూ.2500 విలువైన మత్తు టాబ్లెట్లు
- 4 ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

నల్లగొండ క్రైం, ఆగస్టు 31: గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను నల్లగొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.4వేల విలువైన 140 గ్రాముల గంజాయి, రూ.2500 విలువైన కలిగిన మత్తు టాబ్లెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో చండూరు సీఐ నాగరాజు తెలిపారు. నల్లగొండ పట్టణంలోని ఓల్డ్ సిటీ అక్కచెల్మకు చెందిన ఎస్‌డీ.షోహెబ్, ఎండీ.ఇమ్రాన్‌పాషా, తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లికి చెందిన గంటికంపు దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శీలం వెంకటత్రిపురఅభినవ్ కలిసి గంజాయిని రవాణా చేస్తున్నారు. ఈ నెల 30న నిందితులు మాచర్ల నుంచి నల్లగొండకు బైక్‌పై వస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కనగల్ మండలం తేలకంటిగూడెం టోల్ ప్లాజా వద్ద కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా, నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. దీంతో వారిని తనిఖీ చేయగా, గంజాయి దొరికింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 140 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్‌తో పాటు మత్తు టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయి కేసును ఛేదించిన చండూరు ఇన్‌చార్జి సీఐ నాగరాజు, కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి, సిబ్బంది రమేష్, వెంకన్న, సురేష్, రమేష్, వీరయ్య, దస్తగిరి, స్వామి, వెంకటరెడ్డిని ఎస్పీ అభినందించారు.

సంక్షిప్త సమాచారం...

నల్లగొండ రూరల్: పట్టణంలోని జిల్లా యోగా అసోసియేషన్, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో సెప్టెంబరు 1 యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఆదివారం 10 గంటలలోపు ఇండోర్ స్టేడియానికి రావాలని సూచించారు.

మాడ్గులపల్లి: మండల కేంద్రానికి చెందిన సింగం గురవయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.27 వేలు చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎరుకలి వెంకన్న అందజేశారు.

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలవాలని ఐక్యవేదిక మహిళా విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ విడుదల కావడంపై హర్షం వ్యక్తం చేశారు. నేతన్నకు చేయూతనిచ్చే పథకాలను రూపొందించి అమలు చేయాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని విజయ గార్డెన్స్‌లో సోమవారం క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముళ్లగిరి కాంతయ్య, చిలుక విద్యాసాగర్ తెలిపారు. సమ్మేళనానికి మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ దీపక్‌జాన్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పాస్టర్ కాటంరాజు విజయదీప్ హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత క్రైస్తవులు సమ్మేళనానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వేములపల్లి: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎంపీవో రుషేంద్రమణి అన్నారు. మండలంలోని బుగ్గబావిగూడెంలో అర్హత ఉండి రుణమాఫీ వర్తించని రైతుల నుంచి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్, నితిన్, రైతులు వెంకట్‌రెడ్డి, రఘురామారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములపల్లి: వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో వినాయకుల విగ్రహాలను, మండపాలను ఏర్పాటు చేసుకునేవారు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కట్టంగూరు: భువనగిరిలో ఎమ్మెల్యే వీరేశంను ఉద్దేశ్య పూర్వకంగానే పోలీసులు అడ్డుకున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్దపాటి దానయ్య, కత్తుల వెంకన్న, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ అన్నారు. పోలీసులు వెంటనే క్షమాపణ చెప్పాలని, అవమానించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

రామగిరి: బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కంకణాల నాగరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ కోసం పూర్తి స్థాయిలో పనిచేయడం లేదన్న భావనతో తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దామరచర్ల: అడవిదేవులపల్లి మండలంలోని బాల్నెపల్లి, చిట్యాల గ్రామాల్లో నిర్వహించిన ఆంజనేయస్వామి తిరునాళ్ల వేడుకల్లో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొదిల శ్రీనివాస్, స్కైలాబ్‌నాయక్ ఉన్నారు.

చింతపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీసెల్ మండల అధ్యక్షుడు సురిగి జంగయ్యగౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నార్కట్‌పల్లి: మిర్యాలగూడలో సెప్టెంబరు 2వ తేదీన నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి చెర్కు పెద్దులు తెలిపారు. మండలంలోని పార్టీ ముఖ్య నేతలు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొనాలని కోరారు.

చింతపల్లి: మండలంలోని వింజమూర్ గ్రామంలో కోట మైసమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొంతం సంజీవరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: భువనగిరిలో మంత్రుల పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే వీరేశాన్ని అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు బోడ సునీల్ మాదిగ, వేముల గోపినాథ్ అన్నారు.

చండూరు కమిషనర్‌గా మున్వర్ అలీ


మున్వర్ అలీ

చండూరు, ఆగస్టు 31: చండూరు మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా, ఆయన స్థానంలో హాలియా మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ మున్వర్ అలీ చండూరు కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

హాలియా మునిసిపల్ కమిషనర్‌గా రామదుర్గారెడ్డి


రామదుర్గారెడ్డి

హాలియా, ఆగస్టు 31: హాలియా మునిసిపాలిటీ కమిషనర్‌గా ఎం.రామదుర్గారెడ్డి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మునిసిపల్ కమిషనర్ ఎండీ మున్వర్‌అలీ బదిలీపై చండూరు మునిసిపాలిటీకి వెళ్లారు. సూర్యాపేట జిల్లా తొండ తిరుమలగిరి మునిపాలిటీ నుంచి రామదుర్గారెడ్డి హాలియాకు బదిలీపై వచ్చారు. బాధ్యతల ను స్వీకరించారు. కమిషనర్‌ను మునిసిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు స్వాగతం పలికారు.

పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

దామరచర్ల, ఆగస్టు 31: కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని వాడపల్లి వద్దగల కృష్ణా, మూసీ సంగమం వద్ద కొనసాగుతున్న నీటి ఉధృతిని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువ నాగార్జునసాగర్ నుంచి పెద్ద ఎత్తున దిగువకు నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా మత్స్యకారులు, పర్యాటకులు నదిలోకి దిగవద్దని ఆయన సూచించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం ప్లీనరీ సమావేశం రేపు

నల్లగొండ రూరల్, ఆగస్టు 31: సీపీఎం ప్లీనరీ సమావేశాన్ని ఈ నెల 2వ తేదీన మిర్యాలగూడ పట్టణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ప్లీనరీ సమావేశానికి జిల్లా కమిటీ, మండల, గ్రామ శాఖ సభ్యులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సైదులు


సైదులు

శాలిగౌరారం, ఆగస్టు 31: శాలిగౌరారం మండల డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బందెల సైదులు (పీఎస్, అడ్లూర్), ఉపాధ్యక్షులు కె.మహేశ్వర్, వి.మల్లికార్జున రావు, ఎస్.రజిత, నహీం ఉన్నీసా, ప్రధాన కార్యదర్శి కోక యాదగిరి (జడ్పీ పెర్కకొండారం), కార్యదర్శులుగా బి.అంజయ్య, చిపుట జ్యోతి, ఎండీ తహరుల్లా, బి.వినయ్‌కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బి.వెంకటేశం (పెర్కకొండారం), మారోజు వెంకన్న(మనిమద్దె) ఎన్నికయ్యారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి


మహేందర్‌రెడ్డి

తిప్పర్తి ఆగస్టు 31: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరుసగా ఐదోసారి నామిరెడ్డి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతామని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు కంచర్ల తిరుమలరెడ్డి, బ్రహ్మం, జానీ పాషా ఎన్నికయ్యారు.

మల్లాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

- పది మందికి గాయాలు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 31: పీఏపల్లి మండలం మల్లాపురం గ్రామంలో పిచ్చికుక్క రెండురోజులు స్వైరవిహారం చేసింది. గ్రామాల్లోని వీధుల్లో సంచరిస్తున్న పదిమందిని గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క గ్రామానికి చెందిన డి.సైపాల్‌రెడ్డి, కె.తేజ, ఎ.అనిల్‌పై దాడి చేసి గాయపరిచింది. మరల శనివారం తెల్లవారుజామున ఇంటి ముందు కల్లాపి చల్లుతున్న మారుపాకుల పద్మపై దాడి చేసి చెంపను కొరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతో పాటు గ్రామానికి చెందిన నారాయణదాసు రాములు, మారుపాకుల మస్తాన్, ఆకనబోయిన, బూరుగుల వెంకటమ్మ, వి.విజయలతో పాటు రహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరిపై దాడి చేసింది. వీరందరిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో మారుపాకుల పద్మకు ముఖం మీద గాయపరచడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నల్లగొండ క్రైం: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెనక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం నలగొండ పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన విరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని పానగల్ అద్దంకి బైపాస్ రిక్షా పుల్లర్ కాలనీ ఎదురుగా రోడ్డుపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గరలో ఓ వ్యక్తి (45)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు నల్లగొండ టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.